క్లుప్తంగా

ముస్తాబైన శైవక్షేత్రాలు



చెన్నూర్‌లో ముస్తాబైన శివాలయం

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. శనివారం మహాశివరాత్రిని పురస్కరించుకొని చెన్నూర్ పట్టణంలోని శివాలయం (అంబా ఆగస్తేశ్వరాలయం), చెన్నూర్‌రూరల్ మండలంలోని కత్తెరసాల శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. నేటి(శుక్రవారం) నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చెన్నూర్ శివాలయంలో సాయంత్రం భ్రమరాంభ, మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు మహేశ్వర్‌శర్మ తెలుపగా, కత్తెరసాలలో శనివారం ఉదయం10:31గంటలకు భ్రమరాంభిక, మల్లిఖార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈవో ముక్త రవి తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. వేద పారాయణ, ఆవాహిత దేవతార్చన, శాంతి హవనములు తదితర ప్రత్యేక పూజల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం చేపట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మందమర్రి జీఎం చింతల శ్రీనివాస్ దంపతులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్ పర్యటన



అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలిస్తున్న గౌతమి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని హాజీపూర్, టీకానపల్లి, వేంపల్లి, బుద్దపల్లి, ముల్కల్ల గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్ గౌతమి గురువారం పర్యటించారు. ఈజీఎస్ కింద చేపడుతున్న అభివృద్ధి పనులను, గ్రామాల్లోని నర్సరీలను, క్రీడా ప్రాంగణాలను, అవెన్యూ ప్లాంటేషన్ ప్రక్రియను పరిశీలించారు. దొనబండలో కంపోస్ట్ షెడ్‌ను సందర్శించి కాంపోస్ట్ తయారీపై ప్రత్యేక దృష్టి సారించి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలని సూచించారు. బుద్దిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ఎంపీడీవో అబ్దుల్‌హై, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

వేలం వాయిదా

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో తైబజార్ మార్కెట్ లోపల గల ఫ్లాట్ ఫారములు, స్లాటర్‌హౌజ్, మటన్ మార్కెట్, కూరగాయల మార్కెట్ స్లాట్ ఫారములకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గురువారం వేలం నిర్వహించాల్సి ఉన్నా వాయిదా వేశారు. మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజుకు కేవలం ఇన్‌చార్జి బాధ్యతలను మాత్రమే అప్పగించడం, రెగ్యులర్ కమిషనర్ లేకుండా వేలం నిర్వహణ చేపడితే చట్టపరంగా సమస్యలు వస్తాయని రద్దు చేసినట్లు రెవెన్యూ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తదుపరి వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

‘ఉపాధి’ కూలీలకు నీడ సౌకర్యం కల్పించండి



జన్నారం: ఎండ తీవ్రత పెరుగుతున్నందునా ఉపాధి హామీ కూలీలకు నీడ, నీటి సౌకర్యం కల్పించాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. మండలంలోని తిమ్మాపూర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీలను పలుకరించి ఇబ్బందులు తెలుసుకున్నారు. కూలీల పని దినాలను వెంటవెంటనే నమోదు చేయాలని, కూలీలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో రవీందర్, సర్పంచ్ జాడి గంగాధర్ ఉన్నారు.

కనికరించండి మహాప్రభో..!



బుగ్గకు వెళ్లే మట్టి రోడ్డు

- భక్తులకు కానరాని ఏర్పాట్లు
- ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు కరవు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మహిమాన్విత పుణ్యక్షేత్రంగా పేరుగాంచి భక్తుల కొంగు బంగారంగా నిలుస్తున్న శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఏటా మహా శివరాత్రి పర్వదినాన అంగరంగ వైభవంగా జాతర వేడుకలు నిర్వహిస్తూ లక్షల రూపాయల ఆదాయం గడిస్తున్నప్పటికీ, భక్తులకు మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జాతర నిర్వహిస్తున్న క్రమంలో, ఆలయంలో నెలకొన్న సమస్యలపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ శివారులోని మూడు గుట్టల మధ్య స్వయంభువుగా వెలిసి, నిత్యం గంగను సిరస్సుపై ధరించి అనేక పూజలు అందుకుంటున్నాడు.. శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి. ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పుణ్యక్షేత్రంలో ఏటా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్ద ఎత్తున జాతర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. జాతరకు మంచిర్యాల జిల్లాతో పాటు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో ఒదిగి ఉన్న ఈ ఆలయంలో నెలకొన్న అసౌకర్యాలు మాత్రం.. భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

ఏటా రూ.లక్షల ఆదాయం...

జాతరతో ఏటా లక్షల ఆదాయం వస్తున్నా, ఆలయ అభివృద్ధి మాత్రం జరగడం లేదు. జాతర నిర్వాహణలో భాగంగా తైబజార్ ఏర్పాటుకు నిర్వహించే వేలం ద్వారా, భక్తులు హుండీలో వేసే కట్న కానుకలు, సులభ దర్శనం, శీఘ్ర దర్శనం టికెట్ల ద్వారా లక్షల ఆదాయం వస్తుంటాయి. ఏటా ఆదాయం పెరుగుతున్నా, భక్తులకు కనీస సౌకర్యాల కల్పన అంతంత మాత్రంగానే ఉన్నాయి.

నామమాత్రంగా ఏర్పాట్లు...

బుగ్గకు వెళ్లే దారి పూర్తిగా మట్టి రోడ్డు కావడంతో దుమ్ముధూళితో రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఎన్నోసార్లు హామీలు ఇచ్చినప్పటికీ ఈ మట్టిరోడ్డు రూపురేఖలు మారలేదు. బీటీ రోడ్డు వేసేందుకు నేటికీ అధికార యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ రూపొందించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శనం కోసం క్యూ లైన్‌లలో నిలిచే భక్తులకు షామియానాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో మండుటెండలో గంటల తరబడి వేచి ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. రక్షిత మంచినీరు దొరికే పరిస్థితి లేదు. కోనేరు శుభ్రం చేయకపోవడంతో మురికి నీటిలోనే భక్తులు స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పాటు ఎన్నో అసౌకర్యాలతో భక్తులు సతమతమౌతున్నారు. ఈ యేడేనా ఆలయ కమిటీ, అధికార యంత్రాంగం భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



నీటి సదుపాయం లేని మరుగుదొడ్లు

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. షామియానాలు, నీటివసతి ఏర్పాటు చేస్తున్నాం. మట్టి రోడ్డుపై దుమ్ము రాకుండా నీటిని చల్లించే కార్యక్రమం చేపట్టాం. స్వామి దర్శనం కోసం సులువుగా దర్శనం అయ్యేలా చొరవ తీసుకుంటున్నాం. అన్ని శాఖల సమన్వయంతో జాతరను ఘనంగా నిర్వహిస్తాం.

– బాపు రెడ్డి, ఆలయ ఈవో, బెల్లంపల్లి

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు సూచన
- రెడ్డి కాలనీలో రూ.40లక్షలతో నిర్మించిన పార్కు ప్రారంభం



మంచిర్యాలటౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో ఇప్పటికే ప్రారంభించిన పనులతో పాటు, టెండర్ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్న పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో రూ.40లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ డీఈ మధుకర్, కౌన్సిలర్లు వేములపల్లి సంజీవ్, పోరెడ్డి రాజు, అంకం నరేశ్, సుదమల్ల హరికృష్ణ, సల్ల మహేశ్, ప్రకాశ్, మోతె సుజాత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని కృష్ణాకాలనీలోని శివాలయం ప్రాగంణంలో రూ.2 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను, సీతారాంపల్లి చౌరస్తా నుంచి గోదావరి నది పుష్కర్ ఘాట్ వరకు రూ.12లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 80పోల్స్, లైట్లను ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. గోదావరి నది పుష్కర్ ఘాట్ వద్ద పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేచినీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తాండూర్: మండలం కేంద్రంలోని రేచినీ గ్రామపంచాయతీ కార్యదర్శిపై, అదే గ్రామానికి చెందిన దళిత నాయకుడు సోమయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం లేదని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలకు, అవకతవకలకు పాల్పడుతున్న కార్యదర్శిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దండేపల్లి తహసీల్దార్‌పై...

దండేపల్లి: ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడంలో తమకు సమాచారం ఇవ్వలేదని, రెబ్బనపల్లికి చెందిన కుశనపల్లి దేవక్క దండేపల్లి తహసీల్దార్‌పై కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం విలేకరులకు తెలిపారు. తన బావ రాజయ్య చనిపోవడంతో, తన ఆడబిడ్డ నీలకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చారని పేర్కొంది. ఈ విషయమై తహసీల్దార్ హన్మంతరావును సంప్రదించగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దరఖాస్తులో ఇద్దరు ఉద్యోగుల స్టేట్‌మెంట్ తీసుకుని సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న గుర్రం విన్యాసాలు

- ఉర్సు ప్రారంభం సందర్భంగా వైభవంగా శోభాయాత్ర
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన మత పెద్దలు



శోభాయాత్ర నిర్వహిస్తున్న ముస్లింలు

చెన్నూర్: పట్టణంలోని పోస్టాఫీసు ఎదుట గల హజరత్ సయ్యద్ షా బాబా రహమతుల్లా అలై దర్గా వద్ద ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం గంధం వేడుకలు ప్రారంభమయ్యాయి. గంధం సందర్భంగా సయ్యద్ షా బాబా దర్గా నుంచి విశ్రాంతి భవనం వరకు ముస్లింలు చాదర్‌తో గుర్రంతో విన్యాసాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. గుర్రం విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శోభయాత్రలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి పాల్గొన్నారు. అనంతరం దర్గా వద్ద మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉర్సును ప్రారంభించారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గా వద్ద రాత్రి కవ్వాలి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం రెండో రోజు ఉర్సు కొనసాగుతుందని ఉర్సు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాల్ వైస్‌చైర్మన్, ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నవాజోద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.


‘కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం’



యాత్రలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు (పాత గర్మిళ)వాడలో అర్కల హేమలత ఆధ్వర్యంలో జరిగిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గడపగడపకూ తిరుగుతూ మంచిర్యాల నియోజకవర్గానికి కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

పత్తి నిల్వల్లో పాములు



నిల్వ చేసిన పత్తిలో పాము

వెన్నెల: రైతులకు గిట్టుబాటు ధర లేక ఇళ్లల్లో పత్తి నిల్వ చేసుకుంటే పాములకు పత్తిగడ్డలు ఆవాసంగా మారాయి. మండల కేంద్రంలోని నేతకానివాడకు చెందిన రైతు బెడ్డల వెంకటి రెండు నెలల నుంచి గిట్టుబాటు ధర కోసం ఎదురుచూసి నీరసించి గురువారం అమ్మకానికి ఇంట్లో నుంచి పత్తి తీస్తుండగా మూడు పాములు బయటకు వచ్చాయి. ఒక పామును చంపివేయగా రెండు పాములు తప్పించుకున్నాయి. ప్రమాదం తప్పింది. పత్తి గడ్డల కింద పది పాము గుడ్లు కనిపించాయి. దీంతో పత్తి నిల్వ చేసిన రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

కుల పెద్దలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: కాసిపేట మండలం దుబ్బపల్లి గ్రామంలో నేతకాని కులానికి చెందిన ఓ కుటుంబాన్ని కుల పెద్దలు సామూహికంగా బహిష్కరించడం సరైంది కాదని పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దుర్గం సంపత్ కుటుంబాన్ని నేతకానీ కుల పెద్దలు వ్యక్తిగత కక్షతో బహిష్కరించి వేదనకు గురి చేస్తున్నారని, ఈ తీరు ఏమాత్రం సరికాదన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన ఎస్సై ఫిర్యాదు చేసినా సరిగ్గా విచారణ చేయకుండా ఫేక్ ఫిర్యాదని బాధితులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సంబంధిత పెద్దలపై పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని, బహిష్కరణకు గురైన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సారయ్య, రైతుసమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, సమతా సైనిక్‌దల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం నగేష్, నేతకాని మహార్ హక్కుల సంఘం రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ దుర్గం గోపాల్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

భీమారం: మండలంలోని పోలంపల్లిలో పీరల్స్ ఆఫ్ ఇండియా పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న శ్రీజ అనే విద్యార్థిని హైదరాబాద్‌లో శుక్రవారం (17తేదీన)జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ధని తెలిపారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని 16న జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెస్ పోటీల్లో శ్రీజ ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

జిల్లా స్థాయి సైన్స్‌టాలెంట్ టెస్ట్‌కు..

జన్నారం: జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపికై నట్లు ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఫోరంఫర్‌ఫిజిక్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ పరీక్షల్లో వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన 22మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన అద్వైత్ మొదటి స్థానం, విజయ్ రెండో స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

లక్సెట్టిపేట సీఐగా కృష్ణారెడ్డి



లక్సెట్టిపేట: పట్టణ నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా వై.కృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన కరీముల్లాఖాన్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ క్రిష్ణారెడ్డికి స్థానిక పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



మాట్లాడుతున్న దుర్గం చిన్నయ్య

వేమనపల్లి: మండల కేంద్రం సమీపంలోని మత్తడి వాగు వద్ద రూ.6కోట్ల 15లక్షలతో నిర్మించే వంతెన పనులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గురువారం భూమిపూజ చేశారు. మండలంలోని సూరారం, జక్కెపల్లి, బుయ్యారం ఎన్‌ఈజీఎస్, సీడీపీ నిధులతో సుమారు రూ.కోటి 48 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం సుంపుటంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి కంటి పరీక్షలు పూర్తయిన వారికి కళ్లద్దాలు అందజేశారు. జక్కెపల్లి శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, ఎంపీపీ స్వర్ణలత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వేణుమాదవ్, వైస్ ఎంపీపీ గణపతి, రైతు సంఘం మండలాధ్యక్షుడు భీమన్న, సర్పంచ్‌లు మధుకర్, బాపు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

క్వార్టర్ లేని కార్మికులకు ఇంటి అద్దె చెల్లించాలి



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో అర్హులైన కొందరు కార్మికులకు యాజమాన్యం క్వార్టర్లు కేటాయించలేదని, అలాంటి వారికి ఇంటి అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కేకే–5 గని వద్ద ఆందోళన చేపట్టి గని మేనేజర్ భూశంకరయ్యకు వినతిపత్రం సమర్పించారు. గనులపై మహిళా ఉద్యోగులకు ప్రత్యేక మరుగుదొడ్డి నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు అల్లి రాజేందర్, ప్రవీణ్, నవీన్, తిరుపతి, చైతన్య ఉన్నారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఆర్కే 7 గని

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 7గని వార్షిక లక్ష్యాన్ని సాధించింది. మార్చి 31నాటికి ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సాధించాల్సిన 1.6లక్షల టన్నుల టన్నులను 44 రోజులు ముందే బుధవారం రాత్రి షిఫ్ట్ నాటికి సాధించింది. ఈ మేరకు గురువారం గనిపై జరిగిన కార్యక్రమంలో ఏజెంట్ యస్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఉద్యోగులను అభినందించారు. సమష్టి కృషితోనే ఇది సాధ్యం అయ్యిందని తెలిపారు.

రక్షణ తనిఖీ

శ్రీరాంపూర్: ఆర్కే 7గనిలో రక్షణ తనిఖీని చేపట్టారు. మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారి ఓదెలు ఆధ్వర్యంలో గురువారం సభ్యులు గనిలోకి దిగి యంత్రాలపై తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించారు. యంత్రాల వద్ద ఉద్యోగులు పని చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్ పాల్గొన్నారు.

జీఎంకు వినతి

మందమర్రిరూరల్: గనిలో జరిగే ప్రమాదాల్లో కేవలం మైనింగ్ స్టాఫ్‌ను మాత్రమే బాధ్యులను చేయడం సరికాదని పలు సంఘాల నాయకులు వేరువేరుగా నిరసన చేపట్టారు. ఇటీవల కేటీకే–3 గనిలో జరిగిన ప్రమాదంలో మైనింగ్ స్టాఫ్ ముగ్గురిని బాధ్యులుగా చేస్తూ యాజమాన్యం చర్యలు తీసుకుందని వారిపై తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక సీమంతాలు, అక్షరభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉండే గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం కార్యక్రమాలను చేపట్టారు.

‘భూములు దక్కేవరకు ఆందోళన చేస్తాం’

నస్పూర్: పట్టణ శివారు 42లో టీఎస్‌జీవో కాలనీలో ఇంటి నిర్మాణాల కోసం గురువారం బోర్లు వేస్తుండగా మాడుగుల వెంకటి, కొయ్యల కొమురయ్య, మాడుగుల శంకర్, మాడుగుల రాజం అడ్డుకున్నారు. నస్పూర్‌కి చెందిన దళిత రైతులమని, ఈ భూమి తమదంటూ దీనిపై హై కోర్టులో కేసు ఉందని తెలిపారు. కోర్టులో కేసు ఉండగా బోర్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. తమ భూములు తమకు దక్కే వరకు ఆందోళనలు చేస్తామని తెలిపారు.

అటవీశాఖ క్రీడల్లో ఉద్యోగుల ప్రతిభ

చెన్నూర్: దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్‌కు చెందిన సీనియర్ అసిస్టెంట్ చక్రధర్ చెస్ పోటీల్లో బంగారు పతకం, 25కిలో మీటర్ల మారథాన్ రన్‌లో పోచన్న బంగారు పతకాలు సాధించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గురువారం ఎఫ్‌డీవో ఎస్.రమేశ్, టీఎస్‌జీవో అటవీశాఖ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పొన్న మల్లయ్య అభినందించారు.

‘మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి’

భీమిని: కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో బర్ల పోశయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ, బీజేపీ రాష్ట్ర నాయకులు కాసిపేట శివాజీ పాల్గొని మాట్లాడారు. భూకబ్జాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్యను ఇంటికి సాగనంపాలని విమర్శించారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రామయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘ప్రజా గోసా–బీజేపీ భరోసా’

భీమారం: పేదల సమస్యలు పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ చెన్నూరు నియోజవర్గ ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని ఆరెపల్లి బీజేపీ ప్రజా గోసా–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

రాజుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగింత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఈ నెల 13వ తేదీన మందమర్రి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు అప్పగించిన సీడీఎంఏ అధికారులు ఎట్టకేలకు గురువారం ఫుల్ అడిషనల్ చార్జిని అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత కమిషనర్ ఎస్.బాలకృష్ణపై పోలీసు కేసు నమోదు కావడంతో అధికారులు సస్పెండ్ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1468మంది విద్యార్థులకు గాను 1367మంది విద్యార్థులు హాజరుకాగా 101మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన పరీక్షలకు 1317మంది గాను 1269మంది హాజరుకాగా 63మంది గైర్హాజరైనట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చెన్నూర్: మున్సిపాలిటీలో జరుగుతున్న రోడ్డు, డ్రెయినేజీ పనులను మున్సిపల్ కమిషనర్ గంగాధర్ గురువారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఏజెన్సీ సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

జైపూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాల మల్లన్నస్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీ సీఈవో నరేందర్, ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునిత తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గుట్టపైన, కింద జాతరకు సంబంధించిన పనులను పరిశీలించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ముల్కల్ల గోదావరి పుష్కరఘాట్‌ను గురువారం శిక్షణ కలెక్టర్ గౌతమి, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, రూరల్ సీఐ సంజీవ్, సర్పంచ్ మంచాల శ్రీనివాస్, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎస్సై ఉదయ్‌కిరణ్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన చర్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా సమీక్షించారు.

కూలి పెంచాలి

బెల్లంపల్లి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికులకు 20శాతం కూలి పెంచాలని బెల్లంపల్లి హమాలీ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గెల్లి రాజలింగు డిమాండ్ చేశారు. లేకపోతే సమ్మెకు వెనకాడమని హెచ్చరించారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్

తాండూర్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మండల రిసోర్స్ సెంటర్‌లో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన అనూహ్య స్పందన లభించింది.